
SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 132 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | శనివారం 01-08-2026

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు



- రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
- ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36,441 కోట్లు

**ఢిల్లీ :** దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పీఎం-కిసాన్ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత - మిగతా 2 లో

# రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్




- కొత్త రకం డీజిల్‌ను ఆవిష్కరించిన ఆర్మీ చీఫ్
- ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ వినూత్న తరహా డీజిల్ ఆవిష్కరణ
- మైనస్ 42 డిగ్రీల చలిలోనూ సమర్థంగా పనిచేసే ఇంధనం
- స్వదేశీ పరిజ్ఞానంతో సైన్యం, ఆయిల్ కంపెనీల సంయుక్త రూపకల్పన
- హిమాలయాల్లో సైనిక వాహనాల సమర సన్నద్ధత పెంపు
- ఆత్మనిర్భర్ భారత్ దిశగా రక్షణ రంగంలో కీలక ముందడుగు

**ఢిల్లీ :** భారత సైన్యం సరిహద్దుల్లో తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత శీతల, మంచు ప్రాంతాల్లో సైనిక వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్' డీజిల్‌ను (ఎక్స్‌డబ్ల్యూజీ) ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు. సాధారణంగా డీజిల్ అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద గడ్డకట్టి వాహనాల ఫిల్టర్లను మూసివేస్తుంది. అయితే, ఈ నూతన ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా సమర్థంగా పనిచేస్తుంది. బీఎస్-౹× ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఇంధనాన్ని, ప్రస్తుత సైనిక వాహనాల్లో ఎటువంటి సాంకేతిక మార్పులు చేయకుండానే నేరుగా - మిగతా 2 లో

# పోటెత్తుతున్న గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం
- నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు
- జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు



**భద్రాచలం :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. - మిగతా 2 లో

## నకిలీ నెంబర్ ప్లేట్ వాడితే
# వాహనం సీజ్, క్రిమినల్ కేసు

- హైదరాబాద్ సిటీ పోలీసులు
- నెంబర్ ప్లేట్లు మార్చే వారిపై పోలీసుల ఉక్కుపాదం
- ప్రత్యేక తనిఖీల్లో ఆరుగురిపై కేసు నమోదు
- హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే వాడాలని సూచన




**హైదరాబాద్ :** వాహన చలానాల నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లు మార్చినా, అంకెలు సరిగా కనిపించకుండా ట్యాంపరింగ్ చేసినా ఇక జైలు శిక్ష తప్పదు. నగరంలో నకిలీ నంబర్ ప్లేట్లతో - మిగతా 2 లో




# జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా

- రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్
- ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులను రేవంత్ అవమానించారన్న కిషన్ రెడ్డి
- విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్య
- విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు

**హైదరాబాద్ :** ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై - మిగతా 2 లో

# తెలంగాణలో ఎస్ఐఆర్ మరోసారి గడువు పొడిగింపు




- ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వే
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77 శాతం ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్ :** తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్-మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా - మిగతా 2 లో

# అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- నైపుణ్యాభివృద్ధిశక్తి కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం
- టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచన



**హైదరాబాద్ :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టు నుంచి విదేశీ కంపెనీల్లో ఉద్యోగాల వరకు టామ్‌కామ్ బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో స్కిల్స్, క్యాపిటల్, నాలెడ్జ్ ట్రెయినింగ్ ఇనీషియేటివ్ శాఖ(శక్తి) కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి గారు వివరించారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా - మిగతా 2 లో

# నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం



- పీఎంఓ అధికారిక ప్రకటన విడుదల
- ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- భోగాపురం నుంచి రూ.17,900 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని
- విశాఖలో సెమీకండక్టర్ ప్లాంట్‌తో పాటు పలు విద్యుత్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన

**అమరావతి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీలో సుమారు రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. - మిగతా 2 లో

## ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు
# 45 లక్షల ఓట్లు తొలగింపు

- ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ప్రత్యేక సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల ఓట్ల తొలగింపు
- శాశ్వతంగా వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓట్లను తొలగించినట్లు వెల్లడి
- పేర్ల నమోదు, అభ్యంతరాలకు ఆగస్టు 30 వరకు అవకాశం
- అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్న ఈసీ




**అమరావతి :** ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. - మిగతా 2 లో



# సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- పవన్ తో సమావేశమైన నిమ్మల రామానాయుడు
- రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించిన నేతలు
- నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్

**అమరావతి :** రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న సాగునీటి కొరతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం - మిగతా 2 లో

# సంపాదకీయం

## సైబర్ మోసాలకు చెక్.. బహుముఖ వ్యూహాలే పరిష్కారం

(హెచ్.ప్రతాప్)

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతున్న తరుణంలో సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా విస్తరిస్తున్నాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, డిజిటల్ సేవల వినియోగం పెరగడం ప్రజలకు సౌలభ్యం కల్పించినా, నేరగాళ్లకు కొత్త అవకాశాలను తెరిచింది. ప్రపంచంలో అత్యధిక సైబర్ మోసాలు నమోదవుతున్న దేశాల్లో భారత్ ముందంజలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలు ప్రజల ఆర్థిక భద్రతతో పాటు చట్ట అమలు సంస్థలపై విశ్వాసాన్నీ దెబ్బతీస్తున్నాయి. డిజిటల్ అరెస్ట్ మోసాల్లో నేరస్థులు పోలీసు లేదా దర్యాప్తు సంస్థల అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ చేస్తారు. మనీ లాండరింగ్, మాదకద్రవ్యాలు, పార్శిల్ మోసాలు వంటి కేసుల్లో పేరు ఉందని, అరెస్టు వారెంట్ సిద్ధంగా ఉందని బెదిరిస్తారు. ముందుగానే లీకైన వ్యక్తిగత సమాచారాన్ని చూపించి బాధితుల్లో నమ్మకం కలిగిస్తారు. గంటల తరబడి ఫోన్‌లో ఉంచి, విచారణ పేరిట డబ్బును 'భద్రతా ఖాతా'లో జమ చేయాలని ఒత్తిడి తెస్తారు. ముఖ్యంగా వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు ఈ మోసాలకు ఎక్కువగా బలవుతున్నారు. 2022 నుంచి 2026 మే వరకు దేశంలో దాదాపు మూడు లక్షల డిజిటల్ అరెస్ట్ ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటి వల్ల రూ.4,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. పార్లమెంట్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, 2024లో సైబర్ మోసాల కారణంగా భారతీయులు రూ.22,845 కోట్లు కోల్పోయారు. అదే ఏడాది 22 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ గణాంకాలు సైబర్ నేరాలు ఇప్పుడు విడివిడిగా జరిగే ఘటనలు కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను సవాలు చేస్తున్న ముప్పుగా మారాయని స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న సమాచార సాంకేతిక చట్టం--2000 ప్రధానంగా ఎలక్ట్రానిక్ లావాదేవీలు, డిజిటల్ రికార్డులను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడింది. కృత్రిమ మేధస్సు ఆధారిత మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి ఆధునిక నేరాలను సమర్థంగా ఎదుర్కొనే ప్రత్యేక నిబంధనలు అందులో లేవు. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సూచించినట్లుగా 'డిజిటల్ అరెస్ట్'ను ప్రత్యేక నేరంగా నిర్వచించి, కఠిన శిక్షలను అమలు చేసేలా చట్టాలను సవరించడం అత్యవసరం. అలాగే అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సైబర్ నేరాలను ఎదుర్కొనే ప్రత్యేక దర్యాప్తు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సైబర్ నేరాలను అరికట్టాలంటే చట్టపరమైన చర్యలతో పాటు సాంకేతిక పరిష్కారాలు కూడా కీలకం. కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలతో అనుమానాస్పద లావాదేవీలు, నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత ఖాతాలను తక్షణమే గుర్తించే సామర్థ్యాన్ని పెంచాలి. బ్యాంకులు, టెలికాం సంస్థలు, దర్యాప్తు సంస్థలు పరస్పరం సమాచారాన్ని వేగంగా పంచుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అదే సమయంలో ప్రజల్లో సైబర్ అవగాహన పెంపు, వ్యక్తిగత సమాచార రక్షణ, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకపోవడం వంటి జాగ్రత్తలు కూడా అత్యంత అవసరం. సైబర్ మోసాలు ఇక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సవాలుగా మారాయి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా చట్టాలను నవీకరించడం, కృత్రిమ మేధస్సును రక్షణ సాధనంగా వినియోగించడం, సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడం, ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం ద్వారా మాత్రమే ఈ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చు. సైబర్ భద్రతను ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతగా భావించినప్పుడే డిజిటల్ భారతం మరింత సురక్షితంగా మారుతుంది.

# ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు




**మొదటిపేజీ తరువాయి -** మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు. ప్రజల సౌలభ్యం కోసం తొలగించిన ఓటర్ల జాబితాను రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్‌ఓ/ ఏఈఆర్‌ఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శనకు ఉంచారు. అలాగే, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి, అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు. ఈ భారీ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, 46,397 మంది బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేశారని ఆయన అభినందించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నాయని, గతంలో 68,868 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 1,27,868కి పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం


**మొదటిపేజీ తరువాయి -** విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం ప్రధాని షెడ్యూల్ లో కీలకంగా నిలవనుంది. మోదీ పర్యటనకు సంబంధించిన అధికారిక ప్రకటనను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసింది. ఈ పర్యటన ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక ప్రగతికి గణనీయమైన ఊపునిస్తుందని భావిస్తున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, ఉదయం 10:45 గంటలకు ప్రధాని మోదీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతం పలుకుతారు. ఉదయం 10:58 గంటలకు ప్రధాని టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి, అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో కలిసి విమానాశ్రయంలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత, ప్రధాని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్-టాప్ వాహనంలో బహిరంగ సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. మార్గమధ్యలో 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ 'ధింసా' నృత్యంతో ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:55 గంటల వరకు ప్రధాని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:10 గంటలకు కర్ణాటక పర్యటనకు పయనమవుతారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఒకటిగా ఇది నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే ఈ విమానాశ్రయానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో టెర్మినల్‌ను నిర్మించారు. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. మొత్తం 2,703 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాల్లో విమానాశ్రయం, మిగిలిన ప్రాంతంలో ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీ, ఎడ్యుసిటీ, వాణిజ్య, నివాస సముదాయాలు ఏర్పాటు చేయనున్నారు.

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే



**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు. కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు



**మొదటిపేజీ తరువాయి -** పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది. పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది. సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## పోటెత్తుతున్న గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ



**మొదటిపేజీ తరువాయి -** ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.

## అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు



**మొదటిపేజీ తరువాయి -** స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైనటువంటి రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని ఆయన సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లుగానే బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందే వారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఏటీసీల్లో(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల)లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని ఆయన సూచించారు.

# రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్

**మొదటిపేజీ తరువాయి -** వినియోగించవచ్చు. భారత సైన్యం, ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమన్వయంతో కేవలం ఏడాది వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ ఆవిష్కరణను ఆర్మీ చీఫ్ 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. ఇది సైనిక వాహనాల కదలికలను సులభతరం చేయడమే కాకుండా, సమర సన్నద్ధతను మరియు కార్యాచరణ విశ్వసనీయతను గణనీయంగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. శీతాకాలంలో వాహనాలను స్టార్ట్ చేసేందుకు గతంలో అనుసరించిన ప్రమాదకర పద్ధతులకు ఇది స్వస్తి పలుకుతుందని, తద్వారా సైనిక సిబ్బంది భద్రతతో పాటు మనోధైర్యం పెరుగుతుందని ఆయన వివరించారు. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో చేపట్టిన ఈ కృషి, భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక ఇంధనాల తయారీకి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. కేవలం సైనిక అవసరాలకే కాకుండా, తీవ్రమైన చలి ఉండే ప్రాంతాల్లో పౌర రవాణా అవసరాలకు కూడా ఈ డీజిల్ ఎంతగానో దోహదపడనుంది. ఈ కార్యక్రమానికి ముందు, ఆర్మీ చీఫ్ తూర్పు సెక్టార్‌లోని సైనిక ఫార్మేషన్లను రెండు రోజుల పాటు సందర్శించి, అక్కడి భద్రతా సన్నద్ధతను మరియు వరద సహాయక చర్యలను సమీక్షించారు.

## నకిలీ నెంబర్ ప్లేట్ వాడితే వాహనం సీజ్ , క్రిమినల్ కేసు


**మొదటిపేజీ తరువాయి -** రోడ్లపై తిరుగుతున్న వాహనదారులపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత వారం రోజులుగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా... ఫేక్ ప్లేట్లను వినియోగిస్తున్న ఆరుగురిపై ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాలతో పాటు మేడిపల్లి, పెద్దపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. కొంతమంది నిఘా కెమెరాల నుంచి, ఈ-చలానాల నుంచి తప్పించుకోవడానికి నంబర్లను మార్చడం లేదా వేరే వాహనం నంబర్‌ను వాడుకోవడం లాంటి తీవ్ర నేరాలకు పాల్పడుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. పోలీసుల హెచ్చరికల ప్రకారం... ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిన 'హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు' మాత్రమే వాహనాలకు ఉండాలి. నంబర్ ప్లేట్లపై ఏ విధమైన ఫ్యాన్సీ ఫాంట్లు, స్టిక్కర్లు, దేవుళ్ల బొమ్మలు లేదా నంబర్లను అస్పష్టంగా మార్చే ప్రయత్నాలు చేయకూడదు. నకిలీ ప్లేట్లతో దొరికితే కేవలం ఫైన్‌తో వదిలిపెట్టకుండా, వాహనం సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా



**మొదటిపేజీ తరువాయి -**చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ మరోసారి గడువు పొడిగింపు




**మొదటిపేజీ తరువాయి -** సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేదీ గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.

# హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి

**హైకోర్టు తాజా ఉత్తర్వులు**

**లోతుకుంట భూముల వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని ఆగ్రహం**

**వివాదాస్పద స్థలంలోకి సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని స్పష్టం**

**వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్య**



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను, ఆయన్ను తక్షణమే ఆ పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తాజాగా, రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని నేడు ఉత్తర్వులు జారీ చేసింది. లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రాకు, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. వివాదాస్పద స్థలంలోకి యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. టాటా మోహన్ రావు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉటంకిస్తూ, దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరగడం ప్రజాస్వామ్యానికి 'మరణశాసనం' వంటిదని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది.

# పాణ్యం నియోజకవర్గ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం

ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరణ

నోటీసులు వస్తే ఓటు తొలగింపు కాదని జాయింట్ కలెక్టర్ స్పష్టం



**కర్నూలు ప్రతినిధి, జూలై 31, (సీమకిరణం న్యూస్):** పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై జిల్లా కలెక్టరేట్‌లో ఈఆర్ఓ పాణ్యం మరియు జాయింట్ కలెక్టర్, కర్నూలు ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్, సర్వీస్ ఓటర్ల జాబితా, జాబితా సాఫ్ట్ కాపీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని అధికారులు వివరించారు. అలాగే ఎస్ ఐ ఆర్ తదుపరి దశలో భాగంగా ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు సమర్పించవచ్చని, వాటిని సెప్టెంబర్ 28వ తేదీలోపు పరిష్కరిస్తామని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో సుమారు 50 వేల లాజికల్ ఎంట్రీలు, అలాగే మ్యాపింగ్ కాని 5 వేల మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరందరికీ నోటీసులు జారీ చేసి అవసరమైన పత్రాలు సేకరించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నోటీసు అందిందంటే ఓటు తొలగిస్తున్నారనే అర్థం కాదని, కేవలం ఓటరు వివరాలను ధృవీకరించేందుకు పత్రాలు సేకరిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా చైతన్యం చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ఫిజికల్ కాపీలను మరో రెండు, మూడు రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారి ద్వారా అన్ని రాజకీయ పార్టీలకు అందజేస్తామని తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఇంటింటి సర్వే విజయవంతంగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు అందించిన సహకారం అభినందనీయమని పేర్కొంటూ, తదుపరి దశల్లో కూడా ఇదే సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, పాణ్యం తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, గడివేముల తహసీల్దార్ వెంకటరమణతో పాటు సీపీఎం నాయకుడు జి. రామకృష్ణ, జనసేన నాయకుడు జై మంజునాథ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు ఛత్రపతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రజాక్ వలి తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## బియ్యం ధరలను నియంత్రించండి : మిడతల రమేష్



**నెల్లూరు టౌన్, జులై 31, (సీమకిరణం న్యూస్) :** బియ్యం ధరలు పై పైకి వెళుతున్నాయని వాటిని నియంత్రించాలని బిజెపి నాయకులు మిడతల రమేష్ తెలిపారు. ఆయన కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ విజయ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు బియ్యం దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించారా? లేకుంటే ఏకంగా చైనాకు తరలించారా? బియ్యం ధరలు నియంత్రించాలని ఆయన కోరారు బియ్యం ధరలు కేజీ పై పది రూపాయలు పెరిగాయి. రాష్ట్రంలో కరువు వచ్చేసినట్లు. పంటలు పండనట్లు. గోడౌన్లు ఖాళీ అయినట్లుగా కృత్రిమ సృష్టిని మిల్లర్లు ఏర్పాటు చేసి బియ్యం ధరలు పెంచినట్లు కనిపిస్తోందన్నారు. రైతుల వద్ద నుండి 15 లక్షల పుట్ల ధాన్యాన్ని మిల్లర్లు సేకరించారు . సీజన్లో బిపిటి రకం 14-15 వేలకు, ఆర్ఎన్ఆర్ 18 వేలకు బ్రోకర్ల ద్వారా సేకరించి 90 శాతం మంది రైతాంగాన్ని దెబ్బతీశారన్నారు. మిల్లర్లు రైతులు వద్ద దాచిపెట్టుకున్న ధాన్యాన్ని బీపీటీ 30 వేలకు ఆర్ ఎన్ ఆర్ 35వేలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ధాన్యాన్ని సేకరించిన మిల్లర్లు లాభాల బాట పట్టరన్నారు. బియ్యం ధరలు పెంచి సామాన్యుల మీద భారం మోపుతున్నారన్నారు. మిల్లు లో పుట్టి ధాన్యానికి 550 కేజీలు బియ్యం వస్తుందన్నారు. నూకల రూపంలో 50 కేజీలు. తౌడు రూపంలో 50 కేజీలు. చిరు రూపంలో 20 కేజీలు. పొట్టు రూపంలో 150 కేజీలు. మిల్లర్లకు లభిస్తుంది. నూకలు తౌడు చీరు పొట్టు వలన పుట్టికి 2820రు రూపాయలు మిల్లులో మిగులుతుంది. పుట్టికి 1700 రూపాయలు వ్యయం అవుతుందన్నారు. పెద్ద ఎత్తున లాభాలు గడిస్తున్న మిల్లర్లు ధాన్యాన్ని దాచి పెట్టారా? బియ్యం రూపంలో చైనాకు తరలించారా? ప్రభుత్వం ని గ్గ తేల్చాలని రమేష్ డిమాండ్ చేశారు. బియ్యం ధరల నియంత్రణ లో కఠిన వైఖరి అనుసరించాలని రమేష్ డిఆర్ఓకి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి. అల్లూరు నాగేంద్ర సింగ్. వి చిట్టిబాబు. తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



**నెల్లూరు టౌన్, జూలై 31, (సీమకిరణం న్యూస్) :** జర్నలిస్టు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 15 లక్షల భీమా వర్తిస్తుందిని అందువల్ల పోస్ట్ ఆఫీస్ లో జర్నలిస్టులందరూ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్ ఆఫీస్ అధికారి ప్రత్యూష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లో 1000 రూపాయలు కట్టి అకౌంట్ ఓపెన్ చేసుకోండి.. భీమాకు దరఖాస్తుకు అర్హత లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న జర్నలిస్టులందరూ సద్వినియోగం చేసుకోవాలి అని ఆమె తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులందరికీ పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని.. ఈ ప్రమాద బీమా లో ప్రమాదవశాత్తు మరణించిన జర్నలిస్టులకి సుమారు 15 లక్షల భీమ వస్తుందని ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న జర్నలిస్టులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ మీడియా అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మల్లికార్జున కోరారు. పోస్ట్ ఆఫీస్ లో భీమా అకౌంట్ ని ఓపెన్ చేసిన ముగ్గురు జర్నలిస్టులకు 15 లక్ష రూపాయల బీమా కార్డులను పొందారని నెల్లూరు జిల్లా పోస్ట్ ఆఫీస్ ఎంటిఎస్ అధికారిని ప్రతిష్య,పోస్ట్ మాన్ రాజశేఖర్ లతో కలసి ముగ్గురు జర్నలిస్టులకు బీమా కార్డులను అందజేశారు.అనంతరం ఈ బీమా కార్డుపై పలు జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా పోస్ట్ ఆఫీస్ ఎంటిఎస్ అధికారిని ప్రతిష్య మాట్లాడుతూ కార్మికుల కోసం భీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని.. ఈ బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తికి సుమారు 15 లక్షల రూపాయలు బీమా వస్తుందని.. అంతేకాకుండా మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు పిల్లలకు లక్ష రూపాయలు చొప్పున భీమ వస్తుందన్నారు.మరి ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న వ్యక్తికి రోజుకు 1000 రూపాయలు చొప్పున బీమా వస్తుందన్నారు. ఈ భీమా జిల్లాలోని ప్రతి పోస్ట్ ఆఫీస్ లో అందుబాటులో ఉందని,ఈ బీమాకు అకౌంట్ ఓపెన్ చేయడానికి 200 రూపాయలు అవుతుందని, దానితోపాటు 750 రూపాయలు రెన్యువల్ చార్జెస్ కూడా కట్టాల్సి ఉంటుందన్నారు. ఒకసారి అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత ప్రతి సంవత్సరం 7 50 రూపాయలు రెన్యువల్ కోసం చలానా కట్టుకుంటే.. ఈ బీమా ఆ వ్యక్తికి వర్తిస్తుందన్నారు.ఈ అవకాశాన్ని నెల్లూరు జిల్లాలో ఉన్న జర్నలిస్టులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం మీ దగ్గరలో ఉన్న పోస్ట్ ఆఫీస్ కు సంప్రదిస్తే.. మరిన్ని వివరాలు సంప్రదించవచ్చు అన్నారు.

# రైతులకు మేలుచేసే పీఎండీఎస్ఎస్‌పై భూసార పరీక్షలు







**వెల్దుర్తి, జులై 31 (సీమకిరణం న్యూస్ ):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలములోని నార్లాపురం గ్రామములోని రైతు పెనికలపాటి సంజీవ రాయుడు 6 ఎకరాల పొలములో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పి యమ్ డి యస్) మరియు విత్తన గుళికీకరణ ద్వారా, విత్తనాలు విత్తు కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి, శ్రీమతి పిఎల్ వరలక్ష్మి హాజరవడం జరిగింది ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పి ఎం డి ఎస్) అనేది ప్రధాన పంటకు ముందు 20 నుంచి 30 రకాల పంట విత్తనాలను పప్పు జాతి, నూనె జాతి, సుగంధ ద్రవ్యాల జాతి, పచ్చి రొట్ట, వివిధ రకాల కూరగాయలు విత్తనాలు కలిపి వెదజల్లడం లేదా విత్తటం వల్ల,కలుగు ప్రయోజనాల గురించి జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ. నేల గుల్ల భారీ వాన పాముల వృద్ధి చెందుతాయని, నేలలో నీటినిల్వసామర్థ్యంపెరుగుతుందని, పలు పంటల సాగు వలన అదనపుఆదాయంకలుగుతుందని, నేల కోతకు గురికాదని, జీవవైవిధ్యం పెరుగుతుందని, భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగి భూమిలో సూక్ష్మజీవుల సంతతి.గణనీయంగాపెరుగుతుందని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందని, కలుపు ఉధృతి తగ్గుతుందని, ప్రధాన పంటలో చీడపీడలు తెగుళ్ళ ఉధృతి తగ్గి దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. పి యం డి ఎస్ సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఎల్ నినో ప్రభావంవల్లరైతులునష్టపోకుండా వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు సిబ్బంది అందరూ కూడా ప్రతి గ్రామంలో పీఎండిఎస్ సీడ్ పెలటైజేషన్ చేసి రైతులతో వేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తెలియజేయడం జరిగినది ఎల్నినో ప్రభావము వల్ల రైతులు నష్టపోకుండా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పి యమ్ డి యస్) సాగు, అంతర పంటల సాగు, మిశ్రమ పంటల సాగు, మరియు చిరుధాన్యాల సాగు వైపు దృష్టి సాధించాలని రైతులను కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్ వరలక్ష్మి సహాయ వ్యవసాయ సంచాలకులు పత్తికొండ,ఏ మోహన్ విజయ్ కుమార్ ఉద్యానవన అధికారి నరేష్ రెడ్డి పశు వైద్యాధికారి పుల్లగుమ్మి నవీన్, వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా, ఎ. పి. సి. యన్. యఫ్ మల్లికార్జున, జనార్దన్ మరియు సిబ్బంది ఏఈఓ అజయ్ భార్గవ్, రైతు సేవ కేంద్రం ఇంచార్జ్ ప్రమీల మరియు రైతులు పాల్గొన్నారు

# పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి ఘన వీడ్కోలు -- జిల్లా ఎస్.పి. డా. అజితా వేజెండ్ల




**నెల్లూరు టౌన్, జూలై 31, (సీమకిరణం న్యూస్) :** నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈరోజ జులై 31 న పదవీ విరమణ పొందుతున్న పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్.పి. డా. అజితా వేజెండ్ల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు, దుశాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి వారి విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ పోలీసు సేవ అనేది క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం, ధైర్యసాహసాలు ప్రజాసేవకు ప్రతీక అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి పోలీసు ఉద్యోగి పోలీసు శాఖకు విలువైన ఆస్తి అని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఏఎస్ఐ వి. చెంగయ్య --నెల్లూరు సంతపేట పోలీస్ స్టేషన్, పోలీసు శాఖలో సుదీర్ఘకాలం క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించారు. సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి. మలకొండయ్య --నెల్లూరు డీఏఆర్,డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్‌లో వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, పోలీసు శాఖకు విశేష సేవలు అందించారు. క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఎస్ఐ జి. మలకొండయ్య నెల్లూరు (వి.ఆర్.), పోలీసు శాఖలో సుదీర్ఘకాలం వివిధ విభాగాల్లో సమర్థవంతంగా సేవలందిస్తూ ప్రజా భద్రత పరిరక్షణలో విశేష కృషి చేశారు. తన సేవా కాలంలో నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించి సహోద్యోగులకు ఆదర్శంగా నిలిచారు. హోమ్ గార్డ్ ఎం. శ్రీనివాసులు -- ఆత్మకూరు పోలీస్ స్టేషన్ 1985 సంవత్సరంలో హోమ్ గార్డుగా సేవలు ప్రారంభించి దాదాపు 41 సంవత్సరాలు 3 నెలలు పోలీసు శాఖలో సేవలందించారు. నెల్లూరు పట్టణంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, జిల్లా పోలీసు కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్, బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లతో పాటు జబౌజ, ఫైర్ సర్వీసెస్, ఘ్రాఘ్రా తదితర విభాగాల్లో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. తన సుదీర్ఘ సేవా కాలంలో క్రమశిక్షణ, అంకితభావం, ప్రజాసేవతో విశిష్ట గుర్తింపు పొందారు. పదవీ విరమణ పొందిన ఈ నలుగురు సిబ్బంది తమ సుదీర్ఘ సేవా కాలంలో పోలీసు శాఖ అభివృద్ధికి, శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విశేష కృషి చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. తో పాటు,హోమ్ గార్డ్ డీఎస్పీ రామకృష్ణ , ఏఓ చంద్రమౌళి , ఎస్‌బీ-2 సీఐ శ్రీనివాస రెడ్డి , సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఏఆర్ (అడ్మిన్) ఆర్ఐ శ్రీ హరిబాబు, ఆర్ఐ వెల్ఫేర్ శ్రీ రాజారావు, హోమ్ గార్డ్ =× శ్రీ పాల్ రాజు ,పోలీస్ అసోసియేషన్ కోశాధికారి తురకా. శ్రీనివాసులు, ఇతర అధికారులు, సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు కనీస వేతనం పెంచండి

**నెల్లూరు టౌన్, జులై 31, (సీమకిరణం న్యూస్) :** ఉద్యోగులకు కనీస వేతనం పెంచాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాల పెంపుదలకై కనీస వేతనం 26,000 అమలు చేయాలని వారు నినాదాలు చేశారు కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కనీస వేతనాలు సవరించకపోతే పోరాటం ఉధృతి సిఐటియు నేతల హెచ్చరిక పెద్ద ఎత్తున హాజరైన రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, ఆప్కాస్ కార్మికులు, షెడ్యూల్ ఎంప్లాయ్మెంట్ కార్మికులు వేతనాలను పెంచాలని కనీస వేతనం 26,000 చేయాలని, నాన్ పర్మినెంట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 12వ పి.ఆర్.సిని వెంటనే నియమించాలని, ఆప్కాస్ కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపచేయాలని నెల్లూరు జిల్లాలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున నినదించింది. సిఐటియు నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించింది. ముందుగా నెల్లూరు విఆర్ కళాశాల మైదానం నుండి ప్రారంభమైన ప్రదర్శన జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సాగినది." చంద్రబాబు - కార్మికులు కు జీతాలు పెంచండి","యాజమాన్యాల పక్షాన కాదు- కార్మికుల పక్షాన ఆలోచించండి"అంటూ కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు.




అనంతరం కార్మిక సమూహాన్ని ఉద్దేశించి సిఐటియు నెల్లూరు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు టీవీ వి ప్రసాద్, గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో కార్మికులకు వేతన సవరణ జరిగి 15 ఏళ్లు పైబడ్డ, కార్మికులు పదేపదే అడుగుతున్నా, పాలకులకు చీమకుట్టినట్టు కూడా లేదని వెంటనే వేతన సవరణ జరపాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్ట్ కార్మికుల గా, ఔటర్సింగ్ కార్మికులుగా, ఆప్కాస్ కార్మికులుగా చేస్తున్నటువంటి వారికి ఏడుసంవత్సరాలగా జీతాలు పెంపుదల ఆగిపోయిందన్నారు. మునిసిపల్ కార్మికులకు పిఆర్సి తో ముడిపెట్టి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, ఆ జీతం వాళ్ళ కుటుంబాలు జీవనం సాగించేందుకు తోడ్పడడం లేదన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు వేతన సవరణలు జరిపి, జీతాల పెంచుతూ ఉంటే ఇక్కడ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. వేతన సవరణ జరిగితే ప్రభుత్వానికి ఒక్క పైసా ఖర్చు లేకుండా యాజమాన్యాలు ఆ వేతనాలను చెల్లిస్తాయని, కానీ ఆ పని చేయడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వెనకాడతోందన్నారు. అనేక పరిశ్రమలలో పనిచేస్తున్నటువంటి పారిశ్రామిక కార్మికులకు అతి తక్కువ వేతనాలను యాజమాన్యాలు చెల్లిస్తున్నా వారిని నెలేసి అడగలేని పరిస్థితుల్లో జిల్లాలోని లేబర్ అధికారులు తయారయ్యారన్నార. జిల్లాలో 25 వేల మంది గా ఉన్న ఆక్వా పరిశ్రమల పని చేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా కేజీకి రూపాయల లెక్కన ఇస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతన సవరణ చేసి వేతనాలు పెంచకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేయవలసి వస్తుందని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి నాగేశ్వరరావు, కే పెంచల నరసయ్య,,ఎస్.కె రెహనా బేగం, అల్లాడి గోపాల్, గద్దం అంకయ్య, ఎన్. సతీష్ కుమార్ కె. సురేష్, మారుబోయిన రాజా, జి శివప్రసాద్, కె.హజరత్తయ్య, సుధాకర్,పి. శ్రీనివాసులు, డి రమణయ్య వివిధ యూనియన్ల జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను అందించాలి







**డోన్ టౌన్, జూలై 31,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని 5వ వార్డు ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఐదవ రోజు విజయవంతంగా కొనసాగింది. డోన్ ఎమ్మెల్యేకోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఈ పర్యటనలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి వార్డులోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. గతరెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అద్భుతమైన అభివృద్ధిని, ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ పథకాల ఫలితాలను ఆయన ప్రజలకు కూలంకషంగా వివరించారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన స్థానిక సమస్యలను ఆయన ఎంతో శ్రద్ధగా ఆలకించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు బలమైన భరోసా కల్పించారు. ఎమ్మెల్యే పర్యటనకు స్థానిక మహిళలు, వృద్ధులు యువత నుండి ఆత్మీయ స్వాగతం లభించింది. ప్రజలు చూపించిన ఆపూర్వ ఆదరణ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు శైలేంద్ర శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు టి. ఈ. రాఘవేంద్ర గౌడ్, హరికిషన్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# పనులు వేగవంతం చేయాలి అధికారులకు సూచించిన కోట్ల







**డోన్ టౌన్, జూలై 31,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ రోజు శుక్రవారం మున్సిపల్, అమృత్-2.0, మెగా వాటర్ గ్రిడ్, నేషనల్ హైవే శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా పరిశీలించిన ఎమ్మెల్యే అమ్మ హోటల్ సర్కిల్ అభివృద్ధి పనులు, వినాయక ఘాట్ నిర్మాణం, అమృత్-2.0 వాటర్ పైప్‌లైన్ పనులు నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి డోన్ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్, అమృత్-2.0, మెగా వాటర్ గ్రిడ్, నేషనల్ హైవే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ రాజీనామా చేసే వరకు మా పోరాటం ఆగదు : కాకాణి



**నెల్లూరు టౌన్, జులై 31, (సీమకిరణం న్యూస్) :** మంత్రి లోకేష్ రాజీనామా చేసేంతవరకు తమ పోరాటం ఆగదని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో డీఎస్సీ నియామక ప్రక్రియ, స్పోర్ట్స్ కోటా అమలులో తీవ్రమైన అక్రమాలు, అవకతవకలు జరిగాయిఅన్నారు. డిఎస్సీ లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేయాల్సిందేఅని అన్నారు. లోకేష్ రాజీనామా చేసే వరకు మా పోరాటాలు ఆపబోముఅన్నారు. నెల్లూరు లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, విద్యార్థి తల్లిదండ్రులకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ నాయకులు, బహుశా స్థానిక సంస్థలకి ఎన్నికలు జరపాలని నిర్ణయం తీసుకున్నటువంటి నేపథ్యంలో, ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు---'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరిట,కరపత్రాలు ఎత్తుకొని కనీసం ప్రజలకు ముఖం చూపించలేక, ముఖం చూపిస్తే కొంతమందిచీదరించుకోవడంతో, ఏం చేయాలో దిక్కుతోచనటువంటి స్థితిలో ఈరోజు స్థానిక నాయకులు పాపం కొట్టుమిట్టాడేటటువంటి పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు, లోకేష్‌లు మాత్రం అమరావతిలో సచివాలయంలో కూర్చొని, ప్రతిరోజూ ఒక గ్రామానికి శాసనసభ్యుడు వెళ్లాలి అని చెప్పి నిబంధన పెట్టారు. శాసనసభ్యులను చూస్తుంటే, ఆ కాగితాలు ఎత్తుకొని ఊళ్లల్లోకి పోతే వాళ్లు తలుపులు మూసేసే పరిస్థితి ఏర్పడింది.ఏమి చెప్పాలో పాలుపోనటువంటి స్థితిలో శాసనసభ్యులు ఉన్నారు. గ్రామానికి వెళ్తే'ఇదిగో ఈ కుటుంబానికి ఇది చేశాం, ఈ గ్రామానికి ఇది మేలు చేశాం, ఈ ఊరిలో రోడ్లు వేయించాం, ఈ ఊరిలో డ్రైనేజీ ఇచ్చాం, ఈ ఊరిలో మంచి నీళ్లు ఇచ్చాం లేదా ఇంతమందికి అదనంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్లు ఇచ్చాం, లేదా ప్రభుత్వం ఇచ్చినటువంటి సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అమలు చేశాం...ఇదిగో ఆడబిడ్డ నిధి కింద ?1,500 ఇస్తామని చెప్పి మేము అంతకుముందు గతంలో వచ్చి మీకు కరపత్రాలు పంపిణీ చేశాం, ఇదిగో ఈరోజు ఆడబిడ్డ నిధికి సంబంధించి ?1,500 లెక్కన సంవత్సరానికి, రెండు సంవత్సరాలలో ఈ ?36,000 రూపాయలు మీ చేతుల్లో పెట్టాం కాబట్టి మరలా మా ముఖం... మీకు చూపించడానికి వచ్చాము, మీ ముఖంలో సంతోషం చూడడానికి వచ్చాము' అని చెప్పడానికో...లేదా నిరుద్యోగులు ఉంటే '?3,000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాం, సంవత్సరానికి ?36,000 ఇచ్చాం కాబట్టి, ఇదిగో మీ దగ్గరికి వచ్చి ఈ ?36,000 రూపాయలు ఇచ్చాం' అని చెప్పి చెప్పుకోవడానికి వచ్చాము అనే పరిస్థితి లేదు, 'తల్లికి వందనం అందరికీ ఇస్తామన్నారు .అర్హత కలిగిన లబ్ధిదారులు 80 లక్షలు దాక ఉంటే , తీరా వచ్చేటప్పటికి దాన్ని మరలా ఇంకొక 20 లక్షలకు తగ్గించి, ఈరోజు ఏదో ఆరాకొరాగా ఇస్తే ,కొంతమందికి పడ్డాయి, కొంతమందికి పడక ఇబ్బంది పడేటటువంటి పరిస్థితి ఏర్పడింది ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలుపై కాకాణి తీవ్ర ఆగ్రహం: క్షేత్రస్థాయిలో ప్రజల నిరసనలు తెలియ చేస్తూ కూటమి ప్రభుత్వము సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీల అమలు తీరుపై క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందని ప్రజలు బాధితులు ప్రశ్నిస్తున్నారు. 'అన్నదాత సుఖీభవ' పై రైతుల నిలదీత కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా ఆరు లక్షల మందికి కోత విధిస్తూ ఒక సంవత్సరం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎగ్గొట్టారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "?20,000 ఇస్తామని చెప్పి, ఇప్పుడు చేతిలో ?14,000 మాత్రమే పెడుతున్నారు. అర్హత ఉన్న మాకు లబ్ధి ఎందుకు అందించడం లేదు?" అని లబ్ధిదారులు అధికారులను, నాయకులను నిలదీస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉచిత బస్సులు, గ్యాస్ సిలిండర్ల హామీల బాటలోనే గ్యాస్ సిలిండర్లు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పిన హామీ అమలుకాకపోగా, నగదు బదిలీ విధానం కూడా ఊసే లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు పేరుతో బస్సుల్లో తీవ్ర తోపులాటలు జరుగుతున్నాయని, బట్టలు చిరిగిపోయేలా జనం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కండక్టర్లు, డ్రైవర్లు కూడా ఈ పరిస్థితులు తాళలేక తాము తీవ్రంగా ఇబ్బందీ పడుతున్నామని వాపోతున్నారు.

## పెన్షన్లు, వాలంటీర్ల మోసం

దీజ ఎస్సీలకు పెన్షన్లు చంద్రబాబు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించినా, కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా ఉన్న పథకానికే దిక్కులేకుండా చేశారని బీసీ ,ఎస్ సి వర్గాలు మండిపడుతున్నాయి. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ?5,000 పొందుతున్న వాలంటీర్లకు, తాము అధికారంలోకి వస్తే ?10,000 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు వౌలంటరీ వ్యవస్థనే రద్దు చేసి వీధిపాలు చేశారని వాలంటీర్లు ఆవేదన చెందుతున్నారుఅన్నారు "కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లు" తయారైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు తీవ్ర మానసిక ఆందోళన, ఆగ్రహావేశాలకు గురవుతున్నారు. రకరకాల మాయమాటలు చెప్పి అన్ని వర్గాలనూ మోసం చేసినట్లే, ఉద్యోగులను కూడా ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు.ప్రభుత్వం కార్యక్రమం బ్రహ్మాండంగా జరుగుతోంది అని ప్రకటనలు గుప్పిస్తున్నా,క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్య ప్రజలు కానీ, పథకాలకు అర్హులైన లబ్ధిదారులు కానీ ఈ సభలకు హాజరయ్యే పరిస్థితి లేదు. అభివృద్ధి లేదు, సంక్షేమం లేదు, పథకాలపై స్పష్టత లేదుఅన్నారు కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేదని సభలు ఖాళీగా దర్శనమిస్తుండటమే నిదర్శనమని స్పష్టం చేశారు, ఒకపక్క పొగాకు రైతులు 'మాకు గిట్టుబాటు ధర లేదు' అని చెప్పి రోడ్డెక్కి, 'అయ్యా, మా నిరసన తెలియజేస్తాం' అంటే... పోలీసులని ఇళ్ల దగ్గరకు పంపించి, 'మీరు ఇంట్లో నుంచి బయటకు వస్తే మీ మీద కేసులు పెడతాం' అని రైతులని బెదిరించడం! బలవంతంగా ఎవరైనా వస్తే రైతుల మీద కేసులు నమోదు చేయడం! అంటే... రైతుల మీద మీరు.. రైతులకు సంబంధించిన ద్రోహం,అన్యాయం చేస్తూ, రైతుల మీద కక్ష సాధింపులకు పాల్పడుతూ, వాళ్ల మీద కేసులు బనాయిస్తారా? రైతుల మీద కేసులు బనాయించినటువంటి ప్రభుత్వం ఏదైనా ఉందంటే. ఈ కూటమి ప్రభుత్వం తప్పు! మరే ప్రభుత్వం లేదు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో నెల్లూరు జిల్లాలో సంగం దగ్గర రైతులు ఒక ధర్నా చేస్తే... , వాళ్ల మీద అప్పుడు ఉన్నటువంటి ఎస్పీ కేసు బుక్ చేస్తే... వెంటనే అది సీఎం ఆఫీస్ దృష్టికి వెళ్లడం,నాటి సీఎం జగన్ గారికి తెలియడంతో అదే రోజు సాయంత్రాని కల్లా రైతుల మీద పెట్టినటువంటి కేసులు విత్‌డ్రా చేయించారు.జగన్ మోహన్ రెడ్డి గారు. రైతులు నిరసన తెలియజేస్తే దానికి సంబంధించినటువంటి ఆ సమస్యను మీరు పరిష్కరించాలి గానీ... ఆ సమస్యను పరిష్కరించకుండా వాళ్లు జాతీయ రహదారి మీద కూర్చున్నారంటే దానికి కారణాలు కనుక్కోకుండా మీరు కేసులు ఎలా బుక్ చేస్తారుఅన్నారు ఆ రోజుకారోజే సాయంత్రానికే పోలీసులు పెట్టినటువంటి కేసుల్ని ఉపసంహరించడం జరిగింది.ఈరోజు మీరు ఎక్కడా అటువంటి పరిస్థితి లేదు.అంతులేని అవినీతి, అక్రమాలు తప్ప మరొకటి కనిపించడంలేదుఅన్నారు లోకేష్ నేను స్టాన్‌ఫోర్డ్ (ఖ్జుఅటశీతీ్ు) లో చదువుకున్నాను, జగన్ మోహన్ రెడ్డి తో నేను చర్చకి సిద్ధం' అని మాట్లాడుతున్నాడు, నువ్వు స్టాన్‌ఫోర్డ్‌లో ఏం చదివావో చూశాం. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ లో యూనివర్సిటీలో చదివావా ... లేక స్విమ్మింగ్ పూల్లో చదివావా మాకు అనవసరం అన్నారు.లోకేష్ అసలు నీ స్టాండర్డ్ ఏంది? నువ్వు ఎక్కడ చదువుకున్నావు? నువ్వు ఏ విధంగా చదువుకున్నావు? మాకు తెలుసు కానీ,లోకేష్ నువ్వు చేసినటువంటి దగుల్బాజీ పని మీద వివరణ ఇవ్వా? దమ్ము ఉంటే సమాధానం చెప్పు. లేకపోతే గమ్మున కూర్చో! అంతేగానీ జగన్ ని రమ్మను , ఈయనని రమ్మను అని మాట్లాడుతున్నావ్ ... నీవు పిలిస్తే నీ దగ్గరికి రావటానికి... నీ స్థాయి ఎంత? నీ శక్తి ఎంత? లోకేష్ కు విద్యా శాఖ అప్పగిస్తే దాన్ని ప్రక్షాళన చేస్తున్నాం అని చెప్పి, దాని పేరుతో రకరకాలైనటువంటి స్కామ్‌లకు పాల్పడుతూ, ఈరోజు మీరు దోపిడీ చేస్తుంటే... ఎంతమంది నిరుద్యోగులు ఆవేదన చెందుతుంటే, వాళ్లు అన్యాయానికి గురయ్యాము, మోసపోయాము అని చెప్పి బాధపడుతుంటే దాని గురించి ఆలోచన చేయకుండా, మీరు డిఎస్సికి సంబంధించి సవాళ్లు విసురుతా, వాళ్లను అవమానపరిచే విధంగా మాట్లాడుతా, అధికారుల చేత ప్రెస్ మీట్లు పెట్టేసి, ఏదో ఒక రకంగా దాన్ని మసిపూసి మారేడుకాయ చేసి డైవర్షన్ పాలిటిక్స్ కి పూనుకుంటున్నారు తప్పు...జరిగిన దాంట్లో వాస్తవం ఉందా? లేదా? దానికి సంబంధించి సీబీఐ (జదీ×) విచారణ జరిపిస్తే మీకు వచ్చేటటువంటి నష్టమేంటి? వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయి కదా అన్నారు . ఒకవేళ నిజంగా మీరు దోషులు కాదు, మీరు అక్రమాలకు పాల్పడలేదు... మీకు క్లీన్ చిట్ వస్తుంది. దానికి సంబంధించినటువంటి దాంట్లో మీరు ఎందుకు వెనకాడాల్సినటువంటి పరిస్థితి ఏర్పడుతుంది అంటే... అవినీతి, అక్రమాలు జరిగిన మాట వాస్తవం కాబట్టి! మీ మోసపూరితమంతా బట్టబయలవుతుంది కాబట్టి! మీ దుర్మార్గాలు అన్నీ వెలుగు చూస్తాయి కాబట్టి! మీ అవినీతి కోణం అంతా మొత్తం ప్రజలు తెలుసుకుంటారు కాబట్టి! దాని నుంచి మీరు ముఖం చాటేయడానికి, బయటపడటానికి... ఈరోజు సీబీఐ ఎంక్వైరీ వేయకుండా, దానిలో 'నేను రాజీనామా చేయాల్సినటువంటి అవసరం లేదు' అని తనకు తాను ప్రకటించుకుంటున్నాడు అన్నారు అనంతరం డిఆర్ఓ విజయ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారుఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పారిశ్రామిక యూనిట్ల కోసం 'వన్ స్టాప్ పోర్టల్' ప్రారంభం



**నెల్లూరు టౌన్, జూలై 31, ( సీమకిరణం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా మరియు భారీ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు ఒకే వేదికపై ప్రభుత్వ సేవలు అందించేందుకు వన్ స్టాప్ పోర్టల్ (ాఅవ ాశీజూ ాశీతీ్ుశ్రీ) ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక మరియు వాణిజ్య సంస్థల యాజమాన్యాలు ఈ పోర్టల్లో కేవలం 5 నిమిషాల్లో నమోదు చేసుకొని ప్రభుత్వంతో నేరుగా అనుసంధానం కావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం కోరుతోంది. ఈ పోర్టల్ ద్వారా పరిశ్రమలు తమకు ఎదురవుతున్న సమస్యలు, అభ్యర్థనలు, సూచనలు మరియు అవసరాలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చు. అలాగే ప్రస్తుతం లేదా భవిష్యత్తులో తమ సంస్థలకు అవసరమయ్యే వివిధ హోదాల ఉద్యోగుల అవసరాలను కూడా ప్రభుత్వానికి తెలియజేయవచ్చు. పరిశ్రమల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం అందిన సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని పారిశ్రామిక మరియు వాణిజ్య సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రింది లింక్ ద్వారా వెంటనే నమోదు చేసుకోవాలని కోరడమైనది. https://companies.apedb.in/company-login నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు సంబంధిత యూనిట్లను ప్రత్యక్షంగా సందర్శించి లేదా ఫోన్ ద్వారా నమోదు ప్రక్రియలో సహాయం అందిస్తారు. యాజమాన్యాలు అధికారులకు పూర్తి సహకారం అందించవలసిందిగా కోరడమైనది.

## 30 లీటర్ల నాటసార స్వాధీనం ఇద్దరు వ్యక్తులు అరెస్ట్




**డోన్ టౌన్, జూలై 31,(సీమ కిరణం న్యూస్):** పట్టణంలో అక్రమ మద్యం, శాంతి భద్రత పరిరక్షణకు డోన్ డిఎస్పి శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణంలోని శ్రీరామ్ నగర్ ప్రాంతంలో నాటు సారు అమ్ముతున్న గార్లపాటి విష్ణువర్ధన్, పవర్ మార్కేష్ లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 30 లీటర్లు నాటు సార స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ భాష తెలిపారు. . గత వారం డోన్ పట్టణంలోని యశోద ఆసుపత్రి సమీపంలో రాత్రి సమయంలో జరిగిన దాడి కేసులో కూడా ఈ ఇద్దరు వ్యక్తులు ముద్దాయిలుగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడోన్ పట్టణంలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలు మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేర కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఎవరైనా డోన్ పట్టణంలో అల్లర్లు,గొడవలు చేసిన, అక్రమ మద్యం అమ్మిన , శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరం చర్యలు తీసుకుంటామని మీడియా మిత్రుల ద్వారా డోన్ పట్టణ ప్రజలకుతెలియచేస్తున్నాము. ప్రజలకు ఎవరి వల్ల ఆయన ఇబ్బందులు కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అల కాకుండా చట్టాన్ని చేతులలోకి తీసుకుంటే అటువంటి వారిపైన కఠిన హెచ్చరించారు.

## నియోజకవర్గ స్థాయి ఎంపికలు ప్రారంభం



**నెల్లూరు టౌన్, జూలై 31, (సీమకిరణం న్యూస్) :** భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆగస్టు 29వ న నిర్వహించే "జాతీయ క్రీడా దినోత్సవం" సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో "అమరావతి ఛాంపియన్షిప్ 2026" క్రీడలను నిర్వహిస్తున్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ స్థాయి పోటీల ఎంపికలను ఈరోజు జూలై 31న నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత అశోక్, మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జి. మాధురి లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీలలో నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని దాదాపు 325 మంది ఖ-17 (అండర్-17) విభాగపు బాలబాలికలు ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా అంశాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ "క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దార్ఢ్యాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, క్రీడాస్ఫూర్తిని నేర్పుతాయిఅన్నారు. భారత హాకీ రత్న మేజర్ ధ్యాన్ చంద్ సేవలను స్మరించుకుంటూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, శాప్ ఆధ్వర్యంలో 'అమరావతి ఛాంపియన్ షిప్ 2026' పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయంఅన్నారు. నెల్లూరు నగరంలోని యువత, విద్యార్థులు ఈ ఎంపికల్లో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని నిరూపించుకోవాలి. ఇక్కడి నుండి ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లా పేరును నిలబెట్టాలని సూచించారు. క్రీడాకారులకు, క్రీడల అభివృద్ధికి నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ పూర్తి సహకారాన్ని అందిస్తుందని ప్రకటించారు." ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యం. పాండురంగా రావు, నెల్లూరు ఎంఈఓ అబ్దుల్ హమీద్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ కె. గురుప్రసాద్, ఎస్ జి ఎఫ్ ఐ సెక్రెటరీ పి. వి. రమణయ్య, నెల్లూరు సిటీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ పి. హరి, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ


### ఓటర్ల అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి




**నెల్లూరు టౌన్ , జూలై 31, (సీమకిరణం న్యూస్ ) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=)--2026 కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 1న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ముసాయిదా జాబితా ప్రచురణ ఏర్పాట్లను వివరించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 2,460 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 16,84,176 మంది ఓటర్లు ముసాయిదా జాబితాలో ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 8,25,447 మంది, మహిళలు 8,58,567 మంది, ఇతరులు 162 మంది ఉన్నారని వెల్లడించారు. ఆగస్టు 1 నుంచి ఓటర్ల జాబితాపై ఫారం-6, 6ఏ, 7, 8 ద్వారా కొత్తగా పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణలు, జూ×జ వివరాల సవరణ వంటి అభ్యర్థనలను స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తులను సంబంధిత ERO/AERO కార్యాలయాల్లో, https://voters.eci.gov.in? వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాలపై RP Act--1950 నిబంధనల ప్రకారం అప్పీల్ అవకాశం కూడా ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద పరిహారంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు..

## వాహనానికి ప్రమాదానికి ప్రత్యక్ష సంబంధం ఉండాల్సిందే!




**Insurance Claim Rules:** సివిల్ కేసులలో కొన్ని ఆధారాల ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, కనీసం కొంత సాక్ష్యం అవసరం. ఎటువంటి సాక్ష్యం లేకుండా ఊహాగానాల ఆధారంగా పరిహారం మంజూరు చేయలేరు. మోటార్ వాహనాల చట్టం బాధితులకు ఉపశమనం కలిగించే ఉద్దేశ్యంతో రూపొందించబడినప్పటికీ, దానిని..

**Insurance:** నేరం జరిగిన సమయంలో వాహనం అక్కడ ఉన్నంత మాత్రాన బీమా పరిహారం పొందలేరని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఒక వ్యక్తి చివరిసారిగా వాహనంలో ప్రయాణించిన దాని ఆధారంగా మాత్రమే మోటార్ వాహనాల చట్టం కింద బీమా పరిహారానికి అర్హత పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రమాదానికి వాహన వినియోగానికి మధ్య ప్రత్యక్ష, స్పష్టమైన సంబంధం ఉందని రుజువైతేనే బీమా సంస్థ లేదా వాహన యజమాని నుండి పరిహారం పొందవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్స్ (హీూజు), వివిధ హైకోర్టులు జారీ చేసిన కొన్ని ఉత్తర్వులపై స్టే విధించింది. ప్రమాద స్థలంలో వాహనం ఉందన్న ఏకైక కారణంతో నష్టపరిహారం మంజూరు చేసిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు నిర్ణయాన్ని పక్కనపెట్టడం ద్వారా సుప్రీంకోర్టు చట్టం నిజ స్వరూపాన్ని ఎత్తి చూపింది. ఈ ఘటన 2009 నవంబర్‌లో జరిగింది. తన స్నేహితుడు దిలీప్ అగర్వాల్ కారులో ప్రయాణించి అదృశ్యమైన ఆనంద్ మృతదేహం మూడు రోజుల తర్వాత రోడ్డు పక్కన లభ్యమైంది. ఇది హత్య అని ఆనంద్ కుటుంబం ఆరోపించింది. వారు మోటార్ వెహికల్స్ యాక్ట్‌లోని సెక్షన్ 166 కింద భారీ మొత్తంలో నష్టపరిహారం కోరుతూ క్రిమినల్ కేసు కూడా దాఖలు చేసి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆనంద్ కుటుంబం దాఖలు చేసిన క్రిమినల్ కేసులో సాక్ష్యాధారాలు లేకపోవడంతో హైకోర్టు గతంలో నిందితుడైన దిలీప్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. అయితే, మోటార్ వెహికల్ ట్రిబ్యునల్ ఈ కేసును విచారించినప్పుడు, డ్రైవర్ నిర్లక్ష్యాన్ని నిరూపించలేకపోయినప్పటికీ, మరణానికి ముందు ఇద్దరూ కారులోనే ఉన్నారనే ప్రాతిపదికన అతనికి రూ. 5.64 లక్షల పరిహారాన్ని మంజూరు చేసింది. ఆ తర్వాత, హైకోర్టు ఈ మొత్తాన్ని రూ. 8.61 లక్షలకు పెంచింది. ఈ ఉత్తర్వును ఇప్పుడు సుప్రీంకోర్టు పూర్తిగా రద్దు చేసింది. మోటారు వాహనాల చట్టంలోని 'వాహన వినియోగం వల్ల సంభవించే ప్రమాదం' అనే పదబంధానికి స్పష్టమైన అర్థం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక సంఘటన జరిగిన సమయంలో వాహనం అక్కడ ఉన్నంత మాత్రాన మోటారు వాహనాల చట్టం వర్తించదు. మరణానికి లేదా గాయానికి కారణం ఆ వాహన వినియోగమే అని నిరూపించడానికి సాక్ష్యం అవసరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆనంద్ మరణం విషయంలో కారు లోపల దాడి జరిగిందని సూచించడానికి ఎలాంటి ఫోరెన్సిక్ సాక్ష్యం, రక్తపు మరకలు లేదా వెంట్రుకలు లభించలేదు. అంతేకాకుండా, అక్కడ ఎలాంటి రోడ్డు ప్రమాదం లేదా ఢీకొనడం జరగలేదు. నేరానికి, వాహనానికి మధ్య ప్రత్యక్ష సంబంధం లేని పరిస్థితిలో బీమా కంపెనీని బాధ్యురాలిగా చేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది. అంతకుముందు పిటిషనర్లు రీటా దేవి కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకిస్తూ వాదించారు. కానీ ఆ కేసులో టాక్సీని హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తుండగా డ్రైవర్ హత్యకు గురయ్యాడు. అక్కడ, వాహనమే నేరానికి కేంద్ర బిందువుగా ఉంది. కానీ ప్రస్తుత కేసులో అటువంటి సంబంధాన్ని నిరూపించలేమని జస్టిస్ సంజయ్ కరోల్ ఎత్తి చూపారు. కనీసం కొంత సాక్ష్యం అవసరం. ఎటువంటి సాక్ష్యం లేకుండా ఊహాగానాల ఆధారంగా పరిహారం మంజూరు చేయలేరు. ఈ ఉత్తర్వును రద్దు చేసినప్పటికీ, మానవతా దృక్పథంతో ఆ మొత్తాన్ని తిరిగి రాబట్టుకోకుండా ఆ కుటుంబానికి మినహాయింపు ఇచ్చారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com